



పట్టుబడిన నగదుతో తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు

ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్, వీఆర్వో

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా..

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

కంచికచర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవి లంచం తీసుకుంటూ బుధవారం రాత్రి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. పాసు పుస్తకాలకు సంబంధించి ఒక కౌలు రైతు నుంచి లంచం తీసుకుంటూ ఆమె ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. మండలంలోని నక్కలంపేటకు చెందిన కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు తన యజమాని పొలం వన్‌బీ అడంగల్‌లో నమోదు చేసి, పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసి, కొద్ది రోజుల క్రితం రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. పాసుపుస్తకం కోసం తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు లక్ష రూపాయలకు పైగా నగదు డిమాండ్ చేశారు. పెద్దమొత్తం కావటంతో అంత ఇవ్వలేనని చెప్పటంతో చర్చల అనంతరం పాసుపుస్తకాలు ఇచ్చేందుకు రూ. 30 వేలకు అంగీకరించారు. దీంతో సదరు కౌలు రైతు విజయవాడ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి ఇక్కడ వచ్చిన ఏసీబీ అధికారులు ఒక పథకం ప్రకారం వల పన్నారు. కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు రాత్రి రెవెన్యూ కార్యాలయంకు వచ్చి వీఆర్వో రామారావు, తహసీల్దార్ జాహ్నవికి రూ. 30 వేలు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ విజయవాడ రేంజ్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సీఐలు సత్యనారాయణ, సురేష్ రెడ్‌హ్యాండెడ్‌గా తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావును పట్టుకున్నారు. వారి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, తహసీల్దార్, వీఆర్ఓను అదుపులోకి తీసుకున్నారు. గతంలో మాజీ మంత్రి జోగి రమేష్ ఆయన తనయుడు అగ్రిగోల్డ్ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో కూడా అప్పట్లో విజయవాడ రూరల్ తహసీల్దార్‌గా ఉన్న జాహ్నవిపై కేసు నమోదు కావటం గమనార్హం.

మధుర మామిడికి.. మంచు దెబ్బ!



6లో

గుడివాడలో అన్నింటికీ టీ ట్యాక్స్ చెల్లించాల్సిందే. టీ ట్యాక్స్ అంటే తులసి ట్యాక్స్. తులసి అంటే ఒక చట్టవ్యతిరేక శక్తి. గుడివాడలో తులసి దళం చేసిన అకృత్యాలు అన్నీ, ఇన్నీ కావు. మద్యం, ఇసుక, రేషన్ బియ్యం, కాంట్రాక్టుల సిండికేట్లన్నీ తులసి దళం గుప్పెట్లోనే. బినామీలతో మద్యం దుకాణాలు, రైతు బజార్లలో దాదాగిరీ చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ప్రశ్నిస్తే సొంత పార్టీ వారైనా సరే .. అసభ్యకర ట్రోలింగ్స్‌తో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వంటి వికృతక్రీడలతో పాటు..ప్రశ్నించే గొంతుకలపై వేధింపులు, దాడులకు పాల్పడటం ఇలా చెప్పాలంటే తులసిదళం అరాచకాలెన్నో. రాజ్యాంగేతర శక్తిగా మారిన తులసి దళం అరాచకాలపై ప్రత్యేక కథనం..


గుడివాడలో.. టీ ట్యాక్స్!

తవ్వినకొద్దీ తులసి దళం అరాచకాలు వెలుగులోకి..

ఇసుక, బుసక, మట్టి, గ్రావెల్ తోలాలంటే ట్యాక్స్ కట్టాల్సిందే!

- **రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పనులు ఇలా ఏ పనైనా సరే వాటాలు ఇవ్వాల్సిందే..**
- **మద్యం, రేషన్ మాఫియా సిండికేట్లతో అవినీతి సామ్రాజ్యం**
- **యథేచ్ఛగా అరాచకాలు.. ప్రశ్నిస్తే దాడులు**

(ఆంధ్రజ్యోతి-గుడివాడ): కామేపల్లి తులసిబాబు. గుడివాడలో ఈ పేరు తెలియని వారు లేరు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగానూ తులసిబాబు గురించి చర్చ నడుస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ-6గా రిమాండ్ ఖైదీగా ఉన్న తులసిబాబు ఏడు నెలల్లో గుడివాడ నియోజకవర్గ ప్రజలను ఏడు చెరువుల నీళ్లు తాగించాడు. గుడివాడలో తులసి దళం సాగించిన అకృత్యాలు అన్నీఇన్నీ కావు. అసాంఘిక శక్తులు, రౌడీ గ్యాంగులను వెంటేసుకుని సెటిల్‌మెంట్లు, దందాలతో తులసి దళం రెచ్చిపోయింది. మద్యం సిండికేట్ పేరుతో బెదిరింపులు, బినామీలతో మద్యం దుకాణాల ఏర్పాటు, అక్రమ మట్టి తరలింపు, ఇసుక దొంగతనం, రైతు బజారులో దందా, రేషన్ బియ్యంలో కమీషన్లు, ఆజ్ఞలను అతిక్రమిస్తే సొంత పార్టీ వారిని సైతం వదలకుండా వ్యక్తిత్వహననానికి పాల్పడటం వంటి వాటితో పాటు గుడివాడ నియోజకవర్గంలో టి ట్యాక్స్‌ను అమలు చేస్తున్నాడు.



తులసి ట్యాక్స్ అమలు ఇలా :

- గుడివాడ మండలంలో రహదారుల నిర్మాణ పనుల్లో తులసి ట్యాక్స్‌ను అమలు చేశారు. ముఖ్యంగా కాంట్రాక్టర్ ఎవరైనా కప్పం కట్టాల్సిందేనని హెచ్చరికలు జారీ చేశారు. బిల్లును బట్టి లక్షల్లో ట్యాక్స్‌ను వసూలు చేశారు. ఇటీవల ఒక రహదారి నిర్మాణ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించి, వచ్చిన బిల్లులో తన కమీషన్‌గా రూ.2లక్షల టీ ట్యాక్స్‌ను వసూలు చేశారు.



- టిడ్కో కాలనీలో ఎవరైనా వ్యాపారాలు పెట్టుకోవాలంటే ఖచ్చితంగా తులసి ట్యాక్స్ చెల్లించాల్సిందే. వ్యాపారాన్ని బట్టి రూ.5వేలు నుంచి రూ.20వేలు వరకు చెల్లించాలి. ఆజ్ఞలను పాటించని వారిపైకి మున్సిపల్ అధికారులను పంపి షాపులను సీజ్ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డారు.
- ఎండ బాలయ్య అనే వ్యక్తి కిందటి వైసీపీ ప్రభుత్వంలో గుడివాడ మండలం బొమ్ములూరు దగ్గర వ్యాపార నిమిత్తం వైసీపీ నాయకుడి స్థలాన్ని లీజుకు తీసుకున్నాడు. ఎన్నికల కోడ్ రాకమునుపే భారీ స్థాయిలో ఇసుకను డంప్ చేసుకున్నాడు. తులసి దళం రంగప్రవేశం చేసి టీ ట్యాక్స్ చెల్లించాలని లేకపోతే 12 లారీల ఇసుకను కప్పంగా చెల్లించాలని హుకుం జారీ చేసింది. సీజ్‌లో ఉన్న డంప్‌కు యజమాని ద్వారానే తాళాలు తీయించి 200 టన్నుల ఇసుకను తరలించుకు పోయినట్టు బాధితుడు పేర్కొన్నాడు.
- ఒక విద్యాసంస్థ అధినేతతో కలిసి నియోజకవర్గంలోని ప్రైవేటు విద్యా సంస్థల స్థాయిని బట్టి ట్యాక్స్ వసూలు చేసినట్లు సమాచారం. ప్రముఖ విద్యాసంస్థపైన ఇదే విధంగా తులసిదళం బెదిరింపులకు పాల్పడింది. విద్యాసంస్థల అధినేత రాష్ట్ర మంత్రి ఒకరి దృష్టికి తీసుకువెళ్లగా వివాదం సదుమణిగింది.
- నియోజకవర్గంలో ఇసుక, బుసక లారీల లావాదేవీలు నెరపాలంటే కప్పం చెల్లించాల్సిందే. బుసక లారీకి రూ.500, ఇసుక లారీకి రూ.1000 కప్పం కట్టాల్సిందే. లేని పక్షంలో పోలీస్, రవాణా అధికారులను పంపి లారీలను సీజ్ చేయించారన్న ఫిర్యాదులు ఉన్నాయి.
- బిల్డర్లు ఎవరైన

మిగతా 6లో..

సమస్యల సఖీ

ప్రభుత్వాస్పత్రిలో ఉండాల్సిన కార్యాలయం ఐసీడీఎస్ భవనంలో ఏర్పాటు

ఆపదలో ఉన్న బాధిత మహిళలకు అండగా ఉండాల్సిన సఖీ కేంద్రం(వన్‌స్టాప్ సెంటర్) దిశానిర్దేశం లేకుండా నడుస్తోంది. ఆస్పత్రికి దూరంగా.. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తోంది. ఉన్న ఉద్యోగులకు ఆర్నెల్లుగా జీతాలు లేవు. బాధిత మహిళలకు సకాలంలో వైద్యసేవలు, న్యాయపరమైన, మానసిక ధైర్యం కోసం ఇచ్చే కౌన్సెలింగ్ ఇవ్వడంలేదు. సమస్యలతో సఖీ కేంద్రం కొట్టుమిట్టాడుతోంది.

- **ఆరు నెలలుగా సిబ్బందికి అందని జీతాలు**
- **అరకొర సిబ్బందితోనే కేంద్రం నిర్వహణ**
- **బాధిత మహిళలకు అందని భరోసా**
- **దీర్ఘకాలంగా పట్టించుకోని అధికారులు**

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వివిధ కారణాలతో గృహహింసకు గురైన మహిళలు, లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్న బాలికలు, మహిళలు, వృద్ధులు, కన్నబిడ్డల ఆదరణకు నోచుకోని తల్లులు, ఇంటి నుంచి వెలివేయబడిన వృద్ధ మహిళలు, పనిచేసే ప్రాంతాల్లో వేధింపులకు గురైన శ్రామిక మహిళలు, బాల్య వివాహాలు చేసుకున్న బాలికలు, ఇలా అనేక రూపాల్లో మానసికంగా కుంగిపోయిన మహిళలను అక్కున చేర్చుకుంటుంది 'సఖీ'. వారు విపత్కర పరిస్థితుల నుంచి బయట పడేందుకు మార్గాలు అన్వేషించడం, బాధితుల బంధువులను సఖీ కేంద్రాలకు పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం చేస్తుంది. బాధిత మహిళలు, బాలికలు తమంతట తాముగా ఇంటికి వెళతామని చెప్పేవరకు వారికి కౌన్సెలింగ్ ఇస్తుంది. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పిస్తుంది. కానీ ఇవేమీ ఇక్కడ జరగడంలేదు.



మచిలీపట్నంలోని సఖీ కేంద్రం

నర్సులు లేకుండానే..

మచిలీపట్నం సఖీ కేంద్రంలో తొమ్మిది మంది సిబ్బంది ఉండాలి. వీరిలో నర్సులు ముగ్గురు, ఆయాలు ముగ్గురు, న్యాయవాది, కంప్యూటర్ ఆపరేట్, మహిళా సంరక్షకురాలు. అయితే ముగ్గురు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయాలు ఉన్నప్పటికీ వారిని ఐసీడీఎస్ నడిపే శిశుగృహాల్లో ఉపయోగించుకుంటున్నారు.

వైద్య సేవలకు దూరంగా కేంద్రం

మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో సఖీ కేంద్రం ఉండాలి. వివిధ రకాల దాడుల్లో, లైంగిక వేధింపుల్లో గాయపడిన వారిని ఆస్పత్రిలో ప్రత్యేకంగా కేటాయిచిన గదుల్లో ఉంచి, వారికి రక్షణ కల్పించడంతోపాటు వైద్యసేవలను నిత్యం అందుబాటులో ఉంచాలి. అలా కాకుండా ఆస్పత్రికి దూరంగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలోని పైఅంతస్తులో ఈ గదులను ఏర్పాటు చేశారు. నర్సులు కూడా లేకుండా ఇక్కడ బాధిత మహిళలకు ఎంతమేర వైద్యసేవలు అందుతాయో తెలియని పరిస్థితి. జిల్లాల విభజన జరిగిన నాటి నుంచి మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో సఖీ కేంద్రానికి కనీసంగా రెండు గదులైనా కేటాయించాలని కోరుతూ వస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

నిధులు ఏమవుతున్నాయి?

బాధిత మహిళలకు ఆసరా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఈ నిధులు ఏమవుతున్నాయనే అంశంపై కనీస సమాచారం చెప్పేవారు ఈ కార్యాలయంలో లేరు. ఎవరికి వారు క్యాంప్‌లో ఉన్నారని చెప్పడం గమనార్హం. ఉన్న సిబ్బంది తమకేమీ తెలియదని, అంతా కంప్యూటర్ ఆపరేటర్, అధికారి చూసుకుంటారని చెబుతున్నారు. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బదికి ఆరు నెలలుగా జీతాలు కూడా చెల్లించడంలేదు. టీఏ, డీఏలు కూడా ఇవ్వడం లేదు. బాధిత మహిళలు ఈ కేంద్రంలో ఉంటే వారికోసం చేసిన ఖర్చుల నిమిత్తం ఇక్కడి సిబ్బంది అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. చేసిన ఖర్చులకు కనీసంగా బిల్లులు కూడా చేయడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

నిధులు లేక అప్పులపాలు

వివిధ కేసులకు సంబంధించి బాధిత మహిళలు జిల్లాలోని

మిగతా 6లో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు

3న నోటిఫికేషన్

10న నామినేషన్ల స్వీకరణ.. 11న పరిశీలన

- **27న పోలింగ్.. మార్చి 3న ఓట్ల లెక్కింపు**
- **షెడ్యూలు విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం**
- **మార్చి 29తో ముగియనున్న ఎమ్మెల్సీ పదవీకాలం**

మచిలీపట్నం, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పదవీకాలం ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూలును విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 10వతేదీలోగా అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేయాల్సి ఉంది. 11న నామినేషన్‌ల పరిశీలన ఉంటుంది. 13వతేదీ వరకు నామినేషన్‌లను ఉపసంహరించేందుకు అవకాశం కల్పించారు. 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేస్తారు. మార్చి 8వ తేదీ నాటికి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేస్తారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు కొనసాగుతున్నారు.



రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

- మంత్రి కొల్లు రవీంద్ర

8లో

కోర్టు తీర్పు ఆనందం కలిగించింది

- ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ

8లో

గోడౌన్‌ల్లోని ధాన్యానికి భద్రత కల్పిస్తాం


- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ చైర్మన్ సురేష్‌కుమార్

8లో

రెండు రోజులే గడువు..

1 నుంచి పెరగనున్న భూముల ధరలు

- **ఎనీవేర్ డాక్యుమెంట్ల పరిశీలనలో జాప్యం చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు**
- **48 గంటల వరకు లభించని ఆమోదం**
- **రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని ప్రజల్లో ఆందోళన**



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భూముల ధరలు పెరగటానికి మరో రెండు రోజులే సమయం మిగిలి ఉండటంతో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు పెద్ద సంఖ్యలో సాగుతున్నాయి. ముఖ్యంగా ఎనీవేర్(ఎక్కడైనా) రిజిస్ట్రేషన్లకు డిమాండ్ ఏర్పడింది. దూరబారాన ఉన్న వారు తమ దగ్గర ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో ఇటీవల కాలంలో పలు మార్పులు చేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దరఖాస్తు వచ్చినపుడు దాని మాతృక ఎక్కడో అక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళుతుంది. గంటలోపు అక్కడి సబ్ రిజిస్ట్రార్ దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ డాక్యుమెంట్‌ను పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే ఓకే చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం 48 గంటల సమయం ఇచ్చారు. దీంతో ఎనీవేర్ కింద పెట్టుకున్న డాక్యుమెంట్స్ విషయంలో సబ్‌రిజిస్ట్రార్లు 48 గంటల సమయం ఉంది కదా అని తాత్సారం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఈ ఇబ్బంది పెద్దగా ఎవరికీ తెలియలేదు. బహిర్గతం కూడా కాలేదు. ప్రస్తుతం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల ధరలు పెంచుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయన్న ఉద్దేశంతో లావాదేవీలు ఒక్కసారిగా పెరిగాయి. ఇలా పెరిగిన రిజిస్ట్రేషన్లలో చాలా వరకు ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. త్వరగా లావాదేవీలు అవుతాయన్న కారణంతో ఎక్కువ మంది ఎనీవేర్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్నారు. ఎనీవేర్‌లో వచ్చిన డాక్యుమెంట్లను సబ్‌రిజిస్ట్రార్లు పక్కన

మిగతా 6లో..



పొగమంచుతో మల్లవల్లి మామిడి తోటలు.. మాడిపోయిన పూత, రాలిన పిందెలు



మధుర మామిడికి.. మంచు దెబ్బ!

మాడిపోతున్న పూత, రాలుతున్న పిందె

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్‌రూరల్)

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది.. రైల్వేకు కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చిపెట్టే నూజివీడు, బాపులపాడు మండలాల్లోని మామిడిరైతు ఈ ఏడాది వాతావరణ మార్పులతో తల్లడిల్లుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ సహాయ నిరాకరణ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మామిడి రైతును పొగమంచు తీవ్రంగా దెబ్బతీస్తోంది. అయిల్‌పామ్ వలే ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్ప మామిడితోటలు వేసేందుకు రైతులు అసక్తి చూపడంలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గతంలో 20వేల హెక్టార్లకు పైగా ఉండే మామిడితోటలు 8వేల హెక్టార్లకు పడిపోయాయి. వాతావరణ పరిస్థితులు, ప్రోత్సాహం కరువవడంతో ఉన్న తోటలను తీసివేసి ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మామిడికాయ లభ్యమవడమే కష్టమన్నారు.

● **కాపు నిలబడితే చాలు..**

ఈ సంవత్సరం పూత ఆలస్యమైనా బాగా వచ్చిందని, కానీ మంచు దెబ్బకు మాడి, పిందె దశలో ఉన్న కాయలు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కాపు నిలబడితే అదే పదివేలన్నారు. కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి ఎంతవరకూ వస్తుందనేది అంచనా వేయలేకపోతున్నామని, మంచు దెబ్బకు కాయ సైజు తగ్గడంతో మార్కెట్‌లో రేటు పలకదని, ముందస్తు కొనుగోలు చేసే వ్యాపారులు కూడా వెనకడుగువేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సహకారం అవసరం : అచ్చి రమేష్



ఎకరానికి రూ.60వేల వరకు పెట్టుబడి అవుతుందని, గతంలో

వాతావరణ మార్పులతో రైతుల్లో కలవరం మామిడిరైతును మంచు వణికిస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో పూతతో కళకళలాడుతూ మామిడి తోటలు రైతుల్లో ఆశలు నింపాయి. అంతలోనే వారి ఆశలు మంచు రూపంలో ఆవిరయ్యాయి. మంచు దెబ్బకు పూత మాడి.. పిందెలు రాలిపోవడంతో రైతులకు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మంచు ఇలాగే కొనసాగితే మామిడిపై ఆశలు వదులు కోవల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తుగా కొనుగోలు దారులే పెట్టుబడి పెట్టి ఆదుకునేవారని తెలిపారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో దిగుబడి అంచనా వేయలేక వారు కూడా కాపు వచ్చిన తరువాతే అంటున్నారని తెలిపారు. ఎకరానికి 4టన్నుల దిగుబడి వచ్చి టన్ను రూ.20వేలకు పైగా ధర పలికితే పెట్టుబడి బ్యాంకు వడ్డీలకే సరిపోతుందన్నారు. మంచు కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో పాటు, కాయ చిన్నగా వస్తుందని ధర పలకదని తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్ప వచ్చే సంవత్సరం మామిడితోట తీసివేయక తప్పదని చెబుతున్నారు.



రైపెనింగ్ చాంబర్ అందుబాటులోకి రావాలి

- కట్టుబోయిన శ్రీనివాసరావు

మల్లవల్లి పారిశ్రామికవాడలోని రైపెనింగ్ చాంబర్ అందుబాటులోకి వస్తే మామిడి రైతును ఆదుకున్నట్టవుతుంది. నూజివీడు మామిడికి మళ్లీ కళ రావాలంటే ప్రభుత్వ సహకారం తప్పనిసరి. గతంలో బాపులపాడు మండలంలోని మల్లవల్లి, రేమల్లె, కొత్తపల్లి, మడిచర్ల తదితర ప్రాంతాల్లో 10వేల ఎకరాలకు పైగా మామిడి సాగు చేసే వారు.. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం, సబ్సిడీలు అందించక పోవడంతో సగానికి పైగా తోటలు తీసివేసారు. మామిడి రైతును ప్రోత్సహించేందుకు నాణ్యతతో కూడిన దిగుబడికి సాంకేతికతతో కూడిన సబ్సిడీ పరికరాలు అవసరం. ప్రభుత్వం ఈదిశగా ఆలోచించి సహకరించాలి.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

- జె.జ్యోతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



ఆరుతడి నీటి యాజమాన్య పద్ధతులతో.. తక్కువ మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నాణ్యమైన దిగుబడితో లాభాలు ఆర్జించవచ్చు. నీటి యాజమాన్యం, పిందె రాలకుండా చర్యలు చేపట్టాలి. తడిపెట్టినపుడు కేజీ యూరియా, పొటాష్‌ల మిశ్రమాన్ని పాదులో వేయడం వల్ల చెట్టుకు బలం అంది కాపు రాలదు. పిందె రాలకుండా ఉండేందుకు ప్లానోఫిక్స్ హార్మోన్ ద్రావణాన్ని 1మిలీ 4.5మిలీ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ సమయంలోనే సూక్ష్మపోషకాలు అందేలా చర్యలు చేపట్టాలి. లేదా ఎన్.పీ.కే ద్రావణాన్ని 5మి.లీను 1లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగుమందులు తక్కువ వాడటం ద్వారా పలదీకరణకు ఉపయోగపడే తేనెటీగలకు సహకరించాలి. దీని వల్ల పిందెకట్టు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. సబ్సిడీపై ఫ్రూట్ కవర్లు, వేపనూనె స్థానిక ఆర్బీకే(రైతు సేవా కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయి.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మామిడి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలురకాల సబ్సిడీలపై వివిధ పరికరాలను కూడా అందజేస్తున్నదని, మండల ఉద్యానశాఖ అధికారిని సంప్రదించి అవసరమైన వాటిని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన అధిక దిగుబడులతో మామిడి రైతులు లాభాలు ఆర్జించాలి.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

సబ్సిడీపై బయోగ్యాస్ యూనిట్లు

» విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలతో పాటు విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అందజేస్తున్న బయో గ్యాస్ ప్రాజెక్టును కూడా పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఒయాసిస్ కార్బన్ క్రెడిట్ ప్రోగామ్ ద్వారా పాడి రైతులకు బయో గ్యాస్ యూనిట్ల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏజీఎం అన్వేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో చలసాని మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా నిర్మించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును పాడి రైతులు స్వీకరించాలన్నారు. పాడి రైతులు బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసి వినియోగించేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పశువుల పేడతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసి తద్వారా గ్యాస్‌ను తక్కువ ఖర్చుతో గృహ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. సింగపూర్‌కు చెందిన అరుఖా, పూనేకు చెందిన సిస్టెమా బయో కంపెనీలు సంయుక్తంగా రూ.50వేలు విలువ చేసే బయో గ్యాస్ యూనిట్‌ను కేవలం రూ.7వేలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఇది వినియోగించే రైతులకు ఐదేళ్ల పాటు ప్రోత్సాహకంగా ప్రతినెల నగదును అందిస్తుందని వివరించారు. విజయవాడ చుట్ట పక్కల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యూనిట్లు బాగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అరుఖా సంస్థ ప్రతినిధులు బయో గ్యాస్ ఏర్పాటు, నిర్వహణ, వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, అరుఖా, సిస్టెమా బయో కంపెనీ ప్రతినిధులు, విజయ డెయిరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గుడివాడలో టీ ట్యాక్స్!

(5వ పేజీ తరువాయి)

సరే స్క్వేర్ ఫీట్‌కు కొంత మొత్తంగా ట్యాక్స్ చెల్లిస్తేనే నిర్మాణ పనులు చేపట్టాలి. నియోజకవర్గంలో బెల్టు షాపు పెట్టుకోవాలంటే రూ.5వేలు రుసుంగా చెల్లించాలి. నెలనెలా కప్పం కట్టి వ్యాపారం చేసుకోవాలి. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారికంగానే 150 బెల్టు షాపులు నడుస్తున్నట్లు సమాచారం.

కాదు కూడదంటే కార్యాలయానికి రావాల్సిందే!

ఎవరైన తులసి చెప్పిన పని చేయకున్న, చెప్పిన మొత్తాన్ని ట్యాక్స్‌గా చెల్లించకున్న గుడివాడ బైపాస్ రోడ్డులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో తన ఎదుట హాజరు కావాల్సిందే. ఇక్కడి నుంచే హెచ్చరికలు, దందాలు, సెటిల్‌మెంట్లు నడిచాయి. ఇరిగేషన్, డ్రైనేజీ విభాగాలకు సంబంధించిన పనుల్లో తన కమీషన్ తేలకపోవడంతో టెండర్లనే నిలుపుదల చేయించినట్లు సొంత పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో పనుల తాలుకు టెండర్లు తెరవగా, ఒత్తిడి తట్టుకోలేక గుడివాడ నియోజకవర్గ పరిధిలోని టెండర్లను అధికారులు రద్దు చేశారు. మద్యం టెండర్ల విషయంలో కూడా తాను చెప్పిన వారే టెండర్లు వేయాలని, టెండర్లు వేసేందుకు వచ్చిన కొందరిపై తులసి తన దళాన్ని ఉసిగొల్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.

●ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1.36 కోట్ల వ్యయంతో ఫిల్టర్ బెడ్ రిపేర్లను స్థానిక నాయకుడి పేరు పెట్టి గుంటూరుకుచెందిన తన వర్గీయులతో కాంట్రాక్టు పనులు చేయించినట్లు కూటమి నాయకులు బాహాటంగా విమర్శిస్తున్నారు.

● తోట్లవల్లూరులోని ఒక ఇసుక రీచ్‌ని తన వశం చేసుకుని తన బౌన్సర్‌లను పెట్టి మరీ ఇసుకను తరలించుకుపోయినట్లు సమాచారం.

● మాట వినడం లేదని రైతు బజారు ఎస్టేట్ అధికారిపై తన అనుచరుడుతో దాడి చేయించి, స్టాల్స్‌ను అమ్ముకున్నట్లు తెలిసింది.

● మార్కెట్ యార్డులో గతప్రభుత్వ హయాంలో నిల్వచేసిన ప్రభుత్వ ఇసుకను సైతం తులసి దళం వదల్లేదు. లారీలతో, ట్రాక్టర్లతో తరలించుకుపోయి అమ్ముకుని సొమ్ముచేసుకున్నారు. తాము చెప్పింది వినకుంటే సొంత పార్టీ అనే తేడా లేకుండా సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోలింగ్ చేయించిన ఘనత తులసిదళానికే దక్కుతుంది.

సమస్యల సఖీ

(5వ పేజీ తరువాయి)

వివిధ ప్రాంతాల నుంచి కనీసంగా నెలకు ఐదారుగురు సఖీ కేంద్రానికి వస్తున్నారు. వీరిని ఇక్కడ ఉంచి వారికి కనీస సౌకర్యాల కల్పించాలి. ఈ అవకాశం లేకపోవడంతో త్వరితగతిన వీరిని బయటకు పంపేస్తున్నారు. నిమ్మకూరులోని సదర్ గృహానికి లేదా హనుమాన్ జంక్షన్‌లోని ప్రజ్వల కేంద్రానికి పంపుతున్నారు. బాధిత మహిళలు కోలుకోకుండానే బయటకు పంపేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఈ కేంద్రం ఇక్కడ నడవకపోవడంతో ఇక్కడ పనిచేసే సిబ్బందిని సంబంధిత కేంద్రాన్ని పర్యవేక్షించే అధికారి ఇంటిపనులకు ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

అంతా బాగానే ఉంది

మచిలీపట్నంలోని సఖీ కేంద్రంలో అంతా సక్రమంగానే ఉంది. సర్వజన ఆస్పత్రిలో సఖీ కేంద్రానికి రెండు గదులు కేటాయించాలని చాలా కాలంగా కోరుతున్నాం. కానీ గదులు కేటాయించడంలేదు. సిబ్బందిని ఇతరత్రా ఇంటి పనులకు వాడుకోవడం లేదు.

-విజయలక్ష్మి, సఖీ కేంద్రం విస్తరణాధికారి



మినీబస్సుకు అదనంగా వసూలు చేసిన రశీదు, బొడ్డుబొమ్మ సెంటర్‌లో నగదు వసూలు చేస్తున్న సిబ్బంది

పార్కింగ్ పేరుతో అక్రమ వసూళ్లు!

» వీఎంసీ ఆదాయానికి గండి.. పట్టని అధికారులు

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్, రథం సెంటర్ బొడ్డుబొమ్మ వద్ద అనధికారికంగా వాహనదారుల నుంచి ఓ కాంట్రాక్టర్ పార్కింగ్ రుసుము వసూలు చేస్తు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నాడు. వాహనదారుల నుంచి అదనంగా రుసుము వసూలుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాధరపురానికి చెందిన ఓ కాంట్రాక్టర్ గత ఏడాది వన్‌టౌన్ కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి వెనుక పార్కింగ్ ప్రదేశాన్ని (వెయ్యి చదరపు అడుగులు) ఏడాదికి రూ.32.50లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించే విధంగా పాడుకున్నాడు. కార్పొరేషన్ నిబంధనల మేరకు ప్రతి మూడుగంటలకు కారుకు రూ.30, ఆ తర్వాత ప్రతి గంటకు అదనంగా రూ.10 వసూలు చేయాలి. ఆటోకు ప్రతి 3 గంటలకు రూ.15, ఆ తరువాత ప్రతి గంటకు రూ.10 వసూలు చేయాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ ఆ పార్కింగ్ పక్కనే కార్పొరేషన్ పరిధిలో ఉన్న బొడ్డు బొమ్మ సెంటర్ వద్ద అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్నాడు. మినీ బస్సు, తుఫాన్, ఇతర వాహనాలకు ప్రతి 3 గంటలకు రూ.200 చొప్పున, గంటకు రూ.100చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నాడు. దుర్గగుడికి వచ్చే భక్తుల నుంచి సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పార్కింగ్ రుసుము వసూలు చేయటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్పొరేషన్ ఆదాయానికి లక్షల్లో గండిపడుతోంది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దుర్గగుడిలో అభివృద్ధి పనుల్లో భాగంగా బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్ ప్రాంతాన్ని దేవస్థానానికి కేటాయించాలని ఆలయ సిబ్బంది, భక్తులు కోరుతున్నారు.

నందిగామ సివిల్ జడ్జికి పదోన్నతి

విజయవాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా నందిగామ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యంను పదోన్నతిపై కర్నూలులోని అదనపు జిల్లాసెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. రాష్ట్రంలో న్యాయాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అవనిగడ్డ సివిల్‌జడ్జి బి.బాబునాయక్‌ను చిత్తూరు ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు న్యాయాధికారిగా తాత్కాలికంగా నియమించింది.

ఆరో అదనపు జిల్లాకోర్టు జడ్జిగా పూర్ణిమ

మచిలీపట్నం : కృష్ణాజిల్లా ఆరవ అదనపు కోర్టు జడ్జిగా ఎ పూర్ణిమను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరుజిల్లా నరసారావుపేట కోర్టులో అడిషనల్ సివిల్‌జడ్జి(సీనియర్ డివిజన్)గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి ఇచ్చి కృష్ణాజిల్లా కోర్టులో ఆరవ అదనపు జిల్లాజడ్జిగా నియమించారు.

ఇగ్నో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సీనియర్ రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను దేశవ్యాప్తంగా మార్చి 16న నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడ, తిరుపతిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. దరఖాస్తు చేసుకోవటానికి ఫిబ్రవరి 21తో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూ.ఐజీఎన్ఓయు.ఎసి.ఇన్) ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా దగ్గరలో ఉన్న ఇగ్నో అధ్యయన కేంద్రంలో గానీ, 0866-2565253 నెంబరు ద్వారాగాని సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

రెండు రోజులే గడువు..

(5వ పేజీ తరువాయి)

పెట్టేస్తున్నారు. వాస్తవానికి 48 గంటల వరకు పక్కన పెట్టాల్సిన అవసరం కూడా లేదు. గంట కాకపోతే రెండు గంటల్లో అయినా పరిశీలించి ఓకే చేయవచ్చు. అభ్యంతరాలుంటే తిరస్కరించవచ్చు. సబ్ రిజిస్ట్రార్లు ఈ పని చేయకపోవటం వల్ల సమస్య ఏర్పడుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, కంచికచర్ల, మైలవరం, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కేటగిరీలో వచ్చిన డాక్యుమెంట్లపై తీవ్ర జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వెంటనే తిరస్కరిస్తే సరిదిద్దుకుని మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. నలభై ఎనిమిది గంటల జాప్యం వల్ల ఫిబ్రవరి 1వ తేదీ వచ్చేస్తే అధిక ధరలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పోలీసులు X న్యాయవాదులు

» న్యాయవాది తరపున బార్ పోరాటం
» ఎస్ఐని సస్పెండ్ చేయాలని లాయర్ల రిలేదీక్షలు
» న్యాయవాదికి వ్యతిరేకంగా కదిలిన పెద్దమోదుగపల్లి జనం
» సివిల్‌కోర్టుల వద్ద పోటాపోటీ దీక్షలు
» రెండు వర్గాలతో సీఐ చర్చలు.. ఎట్టకేలకు దీక్షల విరమణ

జగ్గయ్యపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట సివిల్ కోర్టుల సముదాయం వద్ద బుధవారం హైడ్రామా నెలకొంది. మహిళపై దాడి కేసులో ముద్దాయిగా ఉన్న న్యాయవాదిపై కేసు నమోదు చేసిన వత్సవాయి ఎస్ఐ ఉమాను సస్పెండ్ చేయాలని, అక్రమ కేసును ఎత్తివేయాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టగా, గ్రామంలో అశాంతిని నెలకొల్పుతూ తప్పుడు కేసులతో దౌర్జన్యానికి పాల్పడుతున్న న్యాయవాది బిక్షమయ్యను బార్ అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేయాలని, అతడి అనుచరులను అరెస్టు చేయాలని డిమాండ్



న్యాయవాదుల రిలేదీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు సుందరరావు

చేస్తూ పెదమోదుగపల్లి గ్రామస్థులు, బాధిత మహిళతో కలిసి పోటీగా కోర్టు ఎదుట రిలేదీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కోర్టు గేటు వద్ద పోటాపోటీ శిబిరాలు, గత రెండు రోజులుగా న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి రోడ్డెక్కి ఆందోళనలు చేయటంతో పాటు కోర్టు ఎదుట దీక్షలు చేపట్టడంతో జగ్గయ్యపేట ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు రంగంలోకి దిగి రెండు వర్గాలతో చర్చలు జరిపారు. కోర్టు ఎదుట పోలీసుల సహకారంతోనే వేరే గ్రామం నుంచి వచ్చి రిలేదీక్షలు చేస్తున్నారని న్యాయవాదులు భావిస్తుండగా, చట్ట ప్రకారం వ్యవహరించే పోలీసులపై న్యాయవాదులు ఈ విధంగా రోడ్డెక్కి ఆందోళనలు చేయటమేమిటని ఇటు పోలీసులు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు అటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో, జగ్గయ్యపేట ఎస్సై 2 బి.ఐ.వెంకటేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎస్సై ఎం.ఎస్.కె.అర్జున్‌లు పెదమోదుగపల్లి గ్రామ బాధితులతో చర్చలు జరిపారు. చర్చలలో న్యాయవాదులు వత్సవాయి ఎస్ఐ తీరు బాగాలేదని, న్యాయవాదిపై తప్పుడు కేసు పెట్టడంతో పాటు, గతంలో వేరే కేసులో వెళ్లిన ఇద్దరు



పేట కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న పెద్ద మోదుగపల్లి గ్రామస్థులు

న్యాయవాదుల ఎదుట ముద్దాయిలను చితక బాది దుర్భాషలాడటం, న్యాయవాదులను హోంగార్డులతో అడ్డుకున్నారని సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదులతోనే అతని ప్రవర్తన అలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటో ఆలోచన చేయాలని కోరారు. పెదమోదుగపల్లి

న్యాయవాదిని సస్పెండ్ చేయాలి

» బాధితురాలు రాయల కరుణ డిమాండ్

జగ్గయ్యపేట : తనపై దౌర్జన్యంగా వ్యవహరించిన న్యాయవాది బెజవాడ బిక్షమయ్య ప్రాక్టీస్ చేయకుండా బార్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని పెద్దమోదుగపల్లికి చెందిన గ్రామ బాధితురాలు రాయల కరుణ డిమాండ్ చేశారు. కోర్టు వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ దిమ్మెపై దాడికేసులో ఏమాత్రం సంబంధం లేని నాపై బిక్షమయ్య నానా దుర్భాషలాడుతు, మహిళ అని చూడకుండా దౌర్జన్యం చేశారని ఆరోపించారు. బిక్షమయ్య ప్రోద్బలంతో తోటకూర నాగేశ్వరరావు, కిరణ్, అంగన్వాడీ వర్కర్ మరియమ్మలు దాడిచేయగా.. వారిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని చెప్పారు.

కేసులో న్యాయవాది బిక్షమయ్య పాత్రపై విచారణ చేసి, అతని పాత్ర లేదని తేలితే పేరు తొలగిస్తామని, వత్సవాయి ఎస్ఐపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని, రిలేదీక్షలను ఉపసంహరించుకోవాలని కోరారు. దీంతో పెదమోదుగపల్లి గ్రామస్థులు రిలేదీక్షలు తాత్కాలికంగా నిలిపివేసేందుకు అంగీకరించారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు హామి ఇచ్చి వెళ్లిపోయాక న్యాయవాదులు కాసేపు రిలేదీక్షలు కొనసాగించారు. బార్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు పోలీసు ఉన్నతాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ల సూచనతోనే రిలేదీక్షలు తాత్కాలికంగా ఆపేస్తున్నామని ప్రకటించారు. సీనియర్ న్యాయవాదులు ఈవీ జగన్నాథరావు, సామినేని వెంకటేశ్వరరావు, బద్దుల వెంకట్రామయ్య, గోనేల వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా!



కేంద్రం ప్రమోట్ చేస్తున్న నానో యూరియా బాటిళ్లు

» రబీ సీజన్‌లో రైతుల ఇక్కట్లు!
» మార్క్‌ఫెడ్ నుంచి సకాలంలో అందని యూరియా
» అదే అదనుగా సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

బెజవాడ కేంద్రంగా బడా వ్యాపారుల కనుసన్నల్లో ఎరువుల అక్రమ వ్యాపారం జరుగుతోంది. వ్యాపారులు తమ వద్ద ఉన్న సరుకును అధిక ధరలకు రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల మార్క్‌ఫెడ్ ద్వారా సహకార సంఘాలకు, ఆర్‌బీకేలకు ఇంతవరకూ యూరియా అందలేదు. యూరియా వ్యాపారుల సిండికేట్‌ను ప్రశ్నించేందుకు అధికారులూ సాహసించలేని పరిస్థితి.

(ఆంధ్రజ్యోతి, నందిగామ)

బహిరంగ మార్కెట్‌లో ఎరువుల ధరలను స్థిరీకరించటానికి మార్క్‌ఫెడ్ ద్వారా యూరియాను ప్రభుత్వం అందిస్తోంది. మార్క్‌ఫెడ్‌కు సకాలంలో యూరియా రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదు. దాళ్వా సాగుతో పాటు మిర్చి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం యూరియా అవసరం ఎంతో ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల అవసరాలే ఆసరాగా.. ప్రైవేటు వ్యాపారులు రూ. 266లకు విక్రయించాల్సిన 45 కేజీల యూరియా బస్తా రూ.380 నుంచి రూ.450వరకు విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు స్టాక్ లేదని సమాధానం చెబుతున్నారు. అదును పోతే పంట చేతికి రాదన్న బాధతో అడిగినంత చెల్లించి యూరియా కొనుగోలు చేస్తున్నారు.

నానో యూరియా ప్రమోషన్ వల్లే బ్లాక్ మార్కెట్ : వ్యాపారులు

యూరియా 45 కేజీల బస్తాకు కేంద్ర ప్రభుత్వం రూ.1170.79ల సబ్సిడీ ఇస్తోంది. పంటల వారీగా సరాసరి ప్రతి రైతు ఎకరాకు కనీసం మూడు బస్తాల యూరియా వినియోగిస్తారు. ప్రభుత్వంపై భారం పడుతున్న కారణంగా కేంద్రం నానో యూరియా, నానో డీఏపీలను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. లీటరు రూ. 220లకే లభించే నానో యూరియాపై కేంద్రం ఒక్క రూపాయి కూడా సబ్సిడీ ఇచ్చే అవసరం లేదు. యూరియా స్థానంలో నానో యూరియా వినియోగించాలని ప్రభుత్వం సూచిస్తున్నది. అయితే నానో యూరియాలో కేవలం 21శాతం మాత్రమే నత్రజని ఉండడంతో రైతులు 45శాతం నత్రజని ఉన్న సాంప్రదాయ యూరియా వైపే మొగ్గు చూపుతున్నారు. పైగా యూరియాను భూమిలో వేయడం వల్ల నత్రజని గాలికి ఆవిరి కాకుండా మొక్కలకు అందుతుంది. నానో యూరియా స్ప్రే చేయడం వల్ల చాలా వరకు గాలిలో కలిసి పోతుందని రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆర్థిక భారం తగ్గించుకొనేందుకు నానో యూరియాను బలవంతంగానైనా వాడించాలని సంకల్పించింది. ఏళ్ల తరబడి యూరియా వినియోగం బల్ల భూములు సారం కోల్పోతాయని, నానో యూరియాతో మొక్కకు శక్తి రావడంతో పాటు భూసారానికి వచ్చే ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అన్నదాతలు మాత్రం నానో యూరియా వినియోగానికి మొగ్గు చూపడం లేదు. భారమైనా బ్లాక్‌లో కొనుగోలు చేసి మరీ సాంప్రదాయ యూరియానే వినియోగిస్తున్నారు.

వ్యాపారులకు సహకరించేలా మార్క్‌ఫెడ్ అధికారుల చర్యలు

రబీ ప్రారంభమైనా మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీ జరగాల్సిన యూరియాను అధికారులు సిద్ధం చేయలేదు. మార్క్‌ఫెడ్‌కు యూరియా వచ్చినా వ్యాపారుల లబ్ధి కోసం పంపిణీలో జాప్యం చేశారని అధికారులపై అన్నదాతలు మండిపడుతున్నారు. సకాలంలో యూరియా అందజేస్తే తమకు ఈ పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు మార్క్‌ఫెడ్ ఏర్పడిందని, అటువంటి మార్క్‌ఫెడ్‌ను సైతం వ్యాపారులు బ్లాక్ చేసి తమ వద్ద ఉన్న సరుకు అమ్ముకొనే వరకూ పంపిణీ చేయకుండా నిలువరించారని ఆరోపిస్తున్నారు. మార్క్‌ఫెడ్ అధికారుల అవినీతికి తాము బలయ్యామని, నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

యూరియా బ్లాక్‌లో కొనవద్దు..

రబీకి సరిపడా యూరియా సిద్ధంగా ఉన్నట్టు జిల్లా అధికారిణి విజయకుమారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జిల్లాలోని మొత్తం 30 సహకార సంఘాలకు 25 టన్నుల చొప్పున 16,650 బస్తాల యూరియాను మార్క్‌ఫెడ్ నుంచి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వ్యాపారుల బ్లాక్ మార్కెట్ పైనా, మార్క్‌ఫెడ్ నుంచి యూరియా పంపిణీలో జాప్యంపైనా ఆమె సమాధానం దాటవేశారు. మార్క్‌ఫెడ్‌కు కొంత ఆలస్యంగా సరుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. మార్క్‌ఫెడ్ కంటే వ్యాపారులకు ముందుగా సరుకు ఎలా వచ్చిందన్న దానిపై వ్యవసాయ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. నానో యూరియాను అడ్డుపెట్టుకొని వ్యాపారులు దోపిడీ చేస్తుండగా, సబ్సిడీ భారం తగ్గించుకునేందుకు రైతులను నానో యూరియా వైపు నడిపించాలని అధికారులు చూస్తున్నారు.

నానో యూరియా కొంటేనే సాధారణ యూరియా

నానో యూరియా ప్రమోట్ చేయడానికి అధికారులు డీలర్లకు నిబంధనలు పెడుతూ వస్తోంది. ఒక లారీ(20)టన్నుల యూరియా కొనుగోలు చేసిన వ్యాపారులు ఎనిమిది కేసుల నానో యూరియా కొనుగోలు చేయాలన్న నిబంధనను విధించారు. ఈ కారణాన్ని చూపుతూ వ్యాపారులు ఆ ధరను కూడా యూరియా బస్తాలపై వేసి రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

పెనమలూరు
● పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480	

స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణ
గన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 94940-05725, 88851-59008 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.



ఐటీ హబ్‌కు సహకరించండి
● హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ప్రతినిధులను కోరిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గన్నవరంను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ప్రతినిధులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో హెచ్‌సీఎల్ విజయవాడ సెంటర్ హెడ్ శివప్రసాద్, అడ్మిన్ హెడ్ జి.శ్రీనివాసరావులు బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీ కేంద్రం అభివృద్ధి, ఉద్యోగావకాశాలు, మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. ఐటీ రంగాన్ని మరింత గా అభివృద్ధి చేయ డానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ హామీ ఇచ్చారు. గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటంతో ఈ ప్రాంతం ఐటీ అభివృద్ధికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. బెంగళూరు తరహా అనువైన వాతావరణం ఇక్కడ ఉందని, హెచ్‌సీఎల్ టెక్ తమ కార్యాకలాపాలను విస్తరణ చేయాలని కోరారు.

స్వామిత్వ సర్వేతో ఖచ్చితమైన భూ రికార్డులు


బందారుగూడెం మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్వామిత్వ రాష్ట్ర డైరెక్టర్ నిషాంత్‌రెడ్డి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూములను సాంకేతికతో కూడిన సర్వే ద్వారా స్వీయ సాధికారతతో ఖచ్చిత మైన భూ రికార్డులను ప్రజలకు అంద జేసేందుకు స్వామిత్వ డైరెక్టర్ ఎ.నిషాంత్‌రెడ్డి అన్నారు. బందారుగూడెం గ్రామంలో రోవర్‌తో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రఘు, ఈఓపీఆర్డీ కె.లక్ష్మయ్య, డీఎల్‌పీఓ ఏవో రాజబాబు, స్వామిత్వ మిడ్ లెవెల్ ఆఫీసర్ బాబు, వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈడుపుగల్లుకు గుర్తింపు అభినందనీయం


సర్పంచ్ ఇందిర, సుధాకర్ దంపతులను సత్కరిస్తున్న దేవినేని రాజా

కంకిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే ఈడుపుగల్లు గ్రామానికి సర్పంచ్ పందిపాటి ఇందిర గుర్తింపు తీసుకువచ్చారని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు తీసుకొని తిరిగి వచ్చిన సర్పంచ్ ఇందిర, సుధాకర్ దంపతులను బుధవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు గరికిపాటి రవికిషోర్, వీరమాచినేని పవన్, ఎలమకంటి శ్రీనివాస్, పర్వతనేని శ్రీనివాసు, రామకృష్ణ, బాషా, హరీష్, చెల్లి సంగీతరావు, కాకుళ్ల సుధాకర్ పాల్గొన్నారు.


ఈడుపుగల్లు శ్రీనివాస ఫర్టిలైజర్స్ గోడౌనులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నూతలపాటి పద్మావతి

రైతులకు అందుబాటులో ఎరువులు
కంకిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నూతలపాటి పద్మావతి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులోని శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు అత్యధికంగా కొనుగోలు చేసి నిలువ పెట్టకో వద్దని సూచించారు. మోతాదుకి మించి ఏరువులు వినియోగించినా పంటకు దెబ్బ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో పి.ఎం. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ బీవీ శివప్రసాద్

గన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు దురలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉంటే జీవితం బంగారు భవిష్యత్ అవుతుందని సీఐ బీవీ శివప్రసాద్ అన్నారు. స్థానిక వీకేఆర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఈ దశలో మాదకద్రవ్యా లకు అలవాటు పడితే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం
ఉయ్యూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యా ప్రోత్సాహక సేవా కార్యక్రమాల్లో రోటరీక్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం అన్నారు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల డిగ్రీ విద్యార్థిని అబ్దుల్ షాహినా బేగంకు ప్రోత్సాహక బహు మతిగా రోటరీక్లబ్ సభ్యుడు కే నాగేశ్వరరావు సహకారంతో రూ. 15వేల నగదు బుధవారం అందజేశారు.

గ్రామంలోనే ఇళ్లస్థలాలు ఇవ్వాలి


రూరల్ మండల కార్యాలయం వద్ద తహసీల్దార్ బి. సుగుణకు వినతిపత్రం సమర్పిస్తున్న పి.నైనవరం వాసులు

గుణదల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పి.నైనవరంలోనే ఇళ్లస్థలాలు ఇవ్వాలిని గ్రామస్థులు బుధవారం విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రామానికి చెందిన 334 మందికి నూతనంగా ఇళ్ల స్థలాలు కేటాయించిందని, అందులో 44 మందికి మాత్రమే గ్రామ పరిధిలో ఇవ్వగా మిగి లిన 286మందికి ఊరికి దూరంగా నివాసానికి వీలుకాని ప్రదేశంలో ఇచ్చారని దీంతో ఒక్కరు కూడా ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదని, తాజాగా కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో జీవో నెంబరు 23 ప్రకారం గ్రామంలోనే స్థలాలు కేటాయించాలని కోరారు.

వీఆర్ సిద్ధార్థ విద్యార్థికి గోల్డ్ మెడల్


విజేతలతో వీఆర్ సిద్ధార్థ యూనివర్సిటీ యాజమాన్యం

పెనమలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో ఎంసీఏ రెండవ సంవత్సర విద్యార్థి ఉప్పల సాయి సుబ్రహ్మణ్యంకు ఆల్ ఇండియా సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంటులో గోల్డ్ మెడల్ సాధించినట్టు యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పోతిన రఘు తెలిపారు. ఈ నెల 11నుంచి 13 వరకు పాండిచ్చేరిలో జరిగిన 21వ సీనియర్ సౌత్ జోన్ పోటీల్లో ఈ ఘనత సాధించినట్టు తెలిపారు. బుధవారం విజేత సుబ్రహ్మణ్యంను వీసీ రత్నప్రసాద్, డీన్లు వెంకట్రావు, డైరెక్టర్ పాండురంగారావు, ఎంసీఏ విభాగ అధిపతులు అభినందించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


హెల్మెట్‌పై అవగాహన ర్యాలీలో సీఐ మురళీకృష్ణ

కంకిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. హెల్మెట్ వినియోగించాలని కోరుతూ కంకిపాడులో బుధవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా చిన్నారులు ఇష్టానుసారం వాహనాలు నడుపుతున్నారని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మట్ ధరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు
ఉయ్యూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనల స్వీకరణ నిమిత్తం గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. 9959224796 సెల్ నంబరుకు ఫోన్‌చేసి సూచనలు సలహాలు తెలపాలని పేర్కొన్నారు.


కేసీపీ కర్మాగారాన్ని సందర్శించిన విద్యార్థులు

విద్యార్థుల కేసీపీ సందర్శన
ఉయ్యూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు బుధవారం కేసీపీ చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ ట్రేడ్ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా పంచదార కర్మాగారాన్ని సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె జోత్స్నదేవి, ఒకేషనల్ ట్రైనర్ కె వినోద ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత
ఉయ్యూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొబ్బరితోటకు చెందిన దివ్యాంగురాలకి ట్రైసైకిల్ బుధవారం అంద జేశారు. చోడవరపు వరాహలక్ష్మీ నరసింహారావు, విశాలాక్షి దంపతుల జ్ఞాపకార్థం అసోసియేషన్ సభ్యుడు చోడవరపు బాపిరాజు, చంద్రభాను మృత్యుంజయమూర్తి ట్రైసైకిల్ వితరణగా అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి
గన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేము రాధాకృష్ణ అన్నారు. ముస్తాబాద పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ జి.సుధీర్‌బాబు, జేవీహేలు రాజకుమారి, శ్రీనివాసరావు, ఎల్ఎస్ఏ హుస్సేన్, నాగ విశాలాక్షి, రాంబాయి పాల్గొన్నారు.


మహోత్సవాల ఏర్పాట్ల పరిశీలన
హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పెరికీడులో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ నిర్వహించే అద్భుత బాలయేసు మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అద్భుత బాలయేసు మందిర పరిసరాలను సీఐ సత్యనారాయణ, ఎస్సై సురేష్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుడిసె రాజు, వరిగంజి కిషోర్, ప్రత్తిపాటి ఏసుపాదం, ప్రదీప్, జోజి పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని యువకుడి మృతి
పెనమలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు కృష్ణా కరకట్టపై టిప్పరు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా కురిచేడు మండలానికి చెందినయాదగిరి సురేష్ పెదపులిపాక కరకట్ట వద్ద అద్దెకు ఉంటూ స్విగ్గీలో పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజాము న తన విధులు ముగించుకొని విజయవాడ వైపు వెళుతుండగా యనమలకుదురు పెట్రోల్‌బంకు వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పరు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో సురేష్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మంచు పల్లెలు



చుట్టూ విస్తరించిన పచ్చని పంటపొలాలు.. అక్కడక్కడ సాలె గూళ్లు వాటిపై వెండిలా తళుక్కుమంటూ మెరిసిపోతున్న మంచు తెరల తుంపర్లు.. పొలాల మధ్య పనిచేసుకుంటున్న రైతులు , ఆహ్లాదకరమైన చల్లని గాలి.. వెరసి గ్రామీణ వాతావరణంలో కనిపించిన సుందర దృశ్యాలు కనులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న చలి.. మంచు కురుస్తున్న దృశ్యాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.





ఎన్నాళ్లకెన్నాళ్లకు!

రైల్వేతో ముడిపడిన నగరాభివృద్ధి ప్రాజెక్టులకు ముందడుగు | డీఆర్ఎం, కలెక్టర్, కమిషనర్ ఒక్కటిగా భేటీ

- కమిటీ సమావేశానికి చొరవచూపిన ఎంపీ చిన్ని
- పదేళ్ల తర్వాత డీఆర్ఎంతో జిల్లా, నగర అధికారుల భేటీ
- రైల్వే ఆక్రమణలపై సహకరించాలని డీఆర్ఎం విజ్ఞప్తి
- రైల్వే బకాయిలు విడుదల చేయాలని కోరిన కమిషనర్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రైల్వే ప్రాజెక్టులతో ముడిపడిన నగరాభివృద్ధి ప్రాజెక్టులకు ఎట్టకేలకు ముందడుగు పడింది. గుణదల మినీ ఫ్లై ఓవర్, రైల్వేలైన్ వెంబడి ఉన్న కాలువల ఆధునీకరణ, బుడమేరు అభివృద్ధి, రామవరప్పాడు, కొండపల్లి వద్ద ఆర్వోబీల ప్రతిపాదనలు, వాంబేకాలనీ ఆర్వోబీ, సింగ్‌నగర్, రామకృష్ణాపురం వద్ద అదనపు వెంట్స్ వంటి రైల్వేతో ముడిపడిన సమస్యలపై ఏకాభిప్రాయం కుదిరింది. దాదాపు దశాబ్దకాలం తర్వాత రైల్వే అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చొరవతో ఇది సాధ్యమైంది. ఎంపీ శివనాథ్ అధ్యక్షతన డీఆర్ఎం నరేంద్ర పాటిల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎప్పటి నుంచో రైల్వేతో సుహృద్భావ వాతావరణం లేకుండా అపరిష్కృతంగా ఉన్న అన్ని అంశాలపైనా ఈ సమావేశంలో పరిష్కారం దిశగా సానుకూల సంకేతాలు వచ్చాయి. రైల్వే పరంగా ఉన్న అన్ని అభ్యంతరాలు దాదాపుగా తొలిగాయి. మనసువిప్పి మాట్లాడుకోవటంతో దాదాపుగా రైల్వే నుంచి అన్ని ప్రాజెక్టులకు సంబంధించి సానుకూలంగా సంకేతాలు వచ్చాయి. రైల్వే కూడా వీఎంసీతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రస్తావించింది. ప్రధానంగా రాజీవ్‌గాంధీ పార్కు వద్ద పూలమార్కెట్ స్థలం తమదేనని ఆక్రమణలను తొలగించాలని డీఆర్ఎం ప్రతిపాదించారు. ప్రతిగా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర రైల్వే నుంచి రావాల్సిన పన్ను బకాయిలను ప్రస్తావించారు. ఈ సమస్యలకు ఒక అడుగు అయితే ముందుకు పడింది. ప్రజలతో ముడిపడి ఉన్న సమస్యలకు రైల్వే నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయి. ఆక్రమణల విషయంలోనూ ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కార్పొరేషన్, జిల్లా అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించాయి. ఇప్పటికిప్పుడు పరిష్కారమైపోతాయని చెప్పలేం కానీ, ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న అంశాలకు పరిష్కార దిశ అడుగులు పడటం ఆశలను రేకెత్తిస్తున్నాయి.

రైల్వే హబ్‌గా విజయవాడను తీర్చిదిద్దుదాం

- ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల డీపీఆర్‌లను సిద్ధం చేయండి
- జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఎంపీ శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు

కృష్ణలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రైల్వేతో ముడిపడిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను సమష్టి భాగస్వామ్యంతో త్వరగా పూర్తిచేసేందుకు డీపీఆర్‌లను త్వరగా సిద్ధం చేయాలని, ఇప్పటికే చేపట్టిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ శివనాథ్ అధ్యక్షతన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రైల్వేతో ముడిపడిన ఇంజనీరింగ్, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఎస్టేట్ సెక్షన్ల అంశాలపై సమావేశం దృష్టి సారించింది. విజయవాడను ఇబ్బందిపెట్టిన వరదలు పునరావృతం కాకుండా రైల్వే భాగస్వామ్యంతో చేపట్టాల్సిన పనులు నిరాటంకంగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డ్రైన్లలో పూడికతీత, పారిశుధ్యంతో పాటు మ్యాన్‌హోల్స్ వద్ద తేలియాడే చెత్తాచెదారం తొలగింపు, సీసీ అప్రోచ్, ఆర్వోబీ/ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం ఆక్రమణల తొలగింపు, డీపీఆర్‌ల తయారీపై కూలంకుషంగా చర్చించి తక్షణ కార్యాచరణకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్‌లను వెంటనే సిద్ధం చేసి, అనుమతులు సాధించేలా కృషిచేయాలన్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ, బుల్లెట్ ట్రైన్, మెట్రోలైన్ నిర్మాణం వంటి వాటిని కేంద్రం దృష్టికి తీసుకొచ్చి అనుమతులు, నిధుల మంజూరుకు తనవంతు కృషి చేసి నగరాన్ని రైల్వే హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, బుడమేరు ఆధునీకరణతో పాటు నగరాభివృద్ధిపై దృష్టిపెట్టారని, అందుకు అనుగుణంగా వేసవిలో పనుల పూర్తికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. వీఎంసీకి రైల్వేశాఖ చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తే మరిన్ని నిధులు వస్తాయన్నారు.

సమావేశాలతో మెరుగైన ఫలితాలు: డీఆర్ఎం

రైల్వే ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక దృష్టిసారించారని, పెద్దఎత్తున ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పనుల పూర్తికి ఇలాంటి సమావేశాలతో మెరుగైన ఫలితాలుంటాయని డీఆర్ఎం పాటిల్ అన్నారు. డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (సమన్వయం) ఎస్ వరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్

రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు

- రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర మంత్రులు దావోస్‌లో పారిశ్రామిక వేత్తల సదస్సులో పాల్గొని రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులు తెచ్చారని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావోస్‌లో మైనస్ 6 డిగ్రీల చలిని సైతం లెక్క చేయకుండా సీఎం చంద్రబాబు పర్యటించారన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు దాదాపు రూ.6 లక్షల 35 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. పునరుత్పాదక శక్తి, స్టీల్, ఐటీ రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళుతుందన్నారు. తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు సైతం చంద్రబాబు కృషిని అభినందించారని, ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహనరెడ్డి మాత్రం విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మంత్రి లోకేష్ ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రూ.లక్షా 46వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. ఇప్పటికే టీసీఎస్, బీపీసీఎల్, రిలయన్స్, గ్రీన్‌కో, పీపుల్‌టెక్ వంటి కంపెనీలతో ఎంవోయూలు పూర్తయ్యాయన్నారు. పనులను ప్రారంభించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వచ్చే జూన్‌లో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాలో రూ.15వేలు జమ చేస్తామన్నారు. త్వరలో మంగినపూడి బీచ్ అభివృద్ధికి శ్రీకారం చుడతామన్నారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబును ఆహ్వానించడంపై మంత్రి కొల్లు రవీంద్ర అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలకు తొత్తులా పనిచేసిన అధికారిని సభకు ఆహ్వానించడం బాధకలిగించిందని, దీనిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కుంభమేళా తొక్కిసలాటపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. రానున్న కృష్ణా, గోదావరి పుష్కరాల్లో జాగ్రత్త వహిస్తామన్నారు. అనూహ్య కేసు సుప్రీం కోర్టు కొట్టివేయడం బాధ కలిగించిందన్నారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు దావోస్ పర్యటన వల్ల మచిలీపట్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మరో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దావోస్ పర్యటన విజయవంతం కావడంతో వైసీపీ నేతలు బిత్తరపోతున్నారన్నారు. టీడీపీ సీనియర్ నేతలు గొర్రెపాటి గోపీచంద్, కొనకళ్ల బుల్లయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నేతలు లంకే నారాయణ ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, కుంచే నాని, బీజేపీ నేత పంతం గజేంద్ర, జనసేన నేత మాదివాడ రాము, లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు.



రాత్రి సమయంలో నార్తువల్లూరు ఇసుక క్వారీలో తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హేలా షారోన్, డీఎస్పీ ధీరజ్ వినీల్

రాత్రి సమయంలో ఇసుక క్వారీ తనిఖీ

- డీఎస్పీతో కలిసి క్వారీని పరిశీలించిన ఆర్డీవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తోట్లవల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నార్తువల్లూరు ఇసుక క్వారీని మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో ఆర్డీవో హేలా షారోన్, డీఎస్పీ ధీరజ్ వినీల్ తనిఖీ చేశారు. క్వారీలో జరిపిన ఇసుక తవ్వకాల ప్రదేశాలను పరిశీలించారు. 'జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు తూట్లు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించి ఈ తనిఖీలకు వచ్చారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో సదరు అధికారులు తనిఖీలకు వచ్చినట్టు సమాచారం. కాగా మంగళవారం మధ్యాహ్నానికే క్వారీలోని యంత్రాలను బయటకు తరలించేసి తవ్వకాలను నిలిపేశారు.



గోడౌన్‌లను పరిశీలిస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్‌ఛైర్మన్ సురేష్‌కుమార్

గోడౌన్‌ల్లోని ధాన్యానికి భద్రత కల్పిస్తాం

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ చైర్మన్ సురేష్‌కుమార్

గుడివాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్న ధాన్యానికి భద్రత కల్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ ఛైర్మన్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక అరవపేటలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్లలో తనిఖీ చేశారు. గోడౌన్లకు మరమ్మతులు, భద్రత కల్పించాలా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని చోట్ల గోడౌన్‌లకు మరమ్మతుల అవసరాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో బయటపడుతున్న రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపి, రైతు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆయన వెంట సంస్థ అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- ఎమ్మెల్యే సుజనాచౌదరి



దుర్గగుడి అధికారులతో మాస్టర్‌ప్లాన్‌పై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

పెనమలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకొనే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి వెల్లడించారు. దుర్గగుడి అభివృద్ధికి అమలు చేయాల్సిన మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై ఎమ్మెల్యే సుజనాచౌదరి బుధవారం తాడిగడపలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధికి సరికొత్త మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై ఆయన అధికారులతో మాట్లాడారు. దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, అర్కిటెక్టులు, టెక్నికల్ టీంతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలందించడానికి, భవిష్యత్తులో ఎంత మంది భక్తులు వచ్చినా అసౌకర్యం కలగకుండా ఇబ్బందులు రాకుండా ఉండడానికి సరికొత్త మాస్టర్ ప్లాన్‌పై అధికారుల నుంచి వివరాలు తెలుసుకొన్నారు. గతంలో పెట్టిన అంశాలతో పాటు మరికొన్ని అంశాలను పొందుపరచాలని ఆదేశించారు. సమీక్షలో దుర్గగుడి ఈఈలు వైకుంఠరావు, కోటేశ్వరరావు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ రమేష్, శ్రీనివాస్, సుమంత్ పాల్గొన్నారు.



సిమెంట్ తయారీ విధానాన్ని విద్యార్థులకు తెలియజేస్తున్న స్టాలిన్ బాబు, చిత్రంలో ప్రిన్సిపల్ డాక్టర్ కడియాల రవి, డిప్లొమా ఇన్‌చార్జి డి. హేమ, సురేష్‌బాబు తదితరులు

కాలుష్య రహిత సిమెంట్ తయారీపై

విద్యార్థులకు అవగాహన అవసరం

నిపుణులు స్టాలిన్ బాబు

గంగూరు (కంకిపాడు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సిమెంట్ తయారీ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించటం అభినందనీయమని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కడియాల రవి అన్నారు. కాలుష్య రహిత సిమెంట్ తయారీ విధానంపై ప్రముఖ సిమెంట్ కంపెనీల నిపుణుడు స్టాలిన్ బాబు బుధవారం ధనేకుల డిప్లొమా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి. హేమ మాట్లాడుతూ సిమెంట్ కంపెనీల ద్వారా వచ్చే కాలుష్యంతో ప్రకృతి దెబ్బదింటుందన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ స్టాలిన్ బాబు తన అనుభవంతో కాలుష్య నివారణ సిమెంట్ తయారీ యంత్ర నమూనాను తయారు చేయడం ఆయనకు పనిపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, హెచ్‌వోడీ రావి సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు సిమెంట్ తయారీ కంపెనీల వద్దకు తీసుకువెళ్లి అవగాహన కల్పించటం కష్టతరమన్నారు. అలాంటి అవసరం లేకుండానే స్టాలిన్ బాబు యంత్ర నమూనాను తెచ్చి విద్యార్థులు అవగాహన కల్పించారన్నారు.

మళ్లీ జారిన బుడమేరు గట్టు

- రెండునెలలు తిరగకుండానే



ఆంధ్రజ్యోతి - గుడివాడ: కాంట్రాక్టర్ కాసుల కక్కుర్తి, డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యం వెరసి బుడమేరు గట్టు మరోమారు జారింది. ఇటీవల వచ్చిన బుడమేరు వరదలతో నందివాడ మండలం అరిపిరాల సప్టా సమీపంలో బుడమేరు గట్టు జారి, విద్యుత్ స్తంభాలు ఒరిగిన విషయం విదితమే. గత డిసెంబరు 9న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బుడమేరు గట్టు జారుతోంది' కథనానికి డ్రైనేజీ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో గట్టుకు మరమ్మతులు చేయించారు. రెండు నెలలు గడవక మునుపే తిరిగి బుడమేరు గట్టు జారిపోతోంది. తిరిగి అదే అరిపిరాల సప్టా వద్ద కాంట్రాక్టర్ నిర్వాకంతో గట్టు క్రమక్రమంగా జారిపోతోంది.

కోర్టు తీర్పు ఆనందం కలిగించింది

- ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ

లబ్బీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖేల్‌రత్న అవార్డు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ఆనందం కలిగించిదని ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో తన పేరు లేకపోవడం ఆవేదన కలిగించిందని, అన్ని వివరాలతో ఖేల్ రత్న అవార్డుకు దరఖాస్తు చేశానన్నారు. కమిటీ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రాలేదా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియదన్నారు. తన పేరు లేకపోవడంతో ఆవేదన కలిగిందని, అందుకే హైకోర్టును ఆశ్రయించి అన్ని వివరాలు సమర్పించానన్నారు. కోర్టు పరిశీలించి తనకు అవార్డు ఇవ్వాలని ఆదేశించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి తనకు అవార్డు అందజేస్తుందని ఆశిస్తున్నానన్నారు.



పుట్టలో పాలు పోస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సుబ్బారాయుడిని సన్నిధిలో పల్లా

మోపిదేవి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని బుధవారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి ఆయన్ను సత్కరించారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు పల్లా శ్రీనివాసరావుకు అందించారు. స్వామివారి దర్శనానికి మోపిదేవి విచ్చేసిన మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, కొల్లి మురళీకృష్ణ, మేడికొండ విజయ్, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, బల్లా సీతారామ ప్రసాద్ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

గల్లంతైన నాంచారయ్య మృతదేహం లభ్యం



నాగాయలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం శివారు పాత ఉపకాలికి చెందిన కోలా నాంచారయ్య ఈ నెల 20న ఉదయం సముద్రంలో చేపల వేటకు వెళ్లి గుల్లలమోద - లంకేవాని దిబ్బ గ్రామాల మధ్యలో లైట్ హౌస్ వద్ద చేపల వల విసిరి లాగుతుండగా, ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయి గల్లంతయ్యాడు. అనంతరం మత్స్యకారులు ప్రత్యేక పడవల్లో వారం రోజులపాటు గాలించారు. మంగళవారం రాత్రి లంకేవానిదెబ్బ సమీపంలో నాంచారయ్య శవం దొరకటంతో బుధవారం ఉదయం ఏటిమొగ పంటు వద్దకి ఆ శవాన్ని ఒడ్డుకు చేర్చారు. వైద్యాధికారులు పంచనామా చేసిన తర్వాత నాంచారయ్య భౌతికకాయాన్ని బంధువులకు వీఆర్వో అప్పగించినట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు.

ప్రజలకు సేవ చేసేందుకే ఉన్నాం: ఘంటా

ఆటోనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసేందుకే తాము ఉన్నామే తప్ప ఏ రాజకీయ నేతకీ పాలేరుగా పనిచేయడానికి కాదని పంచాయతీ కార్యదర్శుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఘంటా రామ్మోహన్ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎనికేపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై గన్నవరం జనసేన నేతలు దుర్భాషలాడటమనేది ఆక్షేపణీయమని, వారితీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ప్రభుత్వాధికారులతో మార్యదగా వ్యవహరిస్తారని, జనసేన నేతలు కూడా అలాగే నడుచుకోవాలన్నారు. ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెడన, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పడవల మోహనత్రినాథరావు, ఊటుకూరి సుధీర్, ఆకురాతి జనార్ధన్, బళ్ల సాంబశివరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కోటి సభ్యత్వాలతో టీడీపీ రికార్డు

- ఫిబ్రవరిలో కమిటీలు.. అనంతరం ఇన్‌చార్జీల నియామకం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సభ్యత్వ నమోదును పరిశీలించి గుర్తింపు కార్డు అందిస్తున్న పల్లా శ్రీనివాసరావు

మోపిదేవి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మందికిపైగా సభ్యత్వాలు నమోదు చేసి తెలుగుదేశం పార్టీ రికార్డు సృష్టించిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఆయన టీడీపీ సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఏ రాజకీయ పార్టీకి ఇప్పటి వరకు లేనివిధంగా కోటి ఒక లక్ష మందికిపైగా పార్టీ సభ్యత్వాలు స్వీకరించటం జరిగిందన్నారు. సభ్యత్వ నమోదు పూర్తైన వెంటనే ఫిబ్రవరిలో గ్రామస్థాయి నుంచి కమిటీల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అవనిగడ్డ, మరి కొన్ని నియోజకవర్గాల్లో గ్రామస్థాయి నుంచి ఇంచార్జిల నియామకం చేపట్టాలనే డిమాండ్ కార్యకర్తల నుంచి బలంగా ఉందన్నారు. కమిటీ ఎన్నిక పూర్తయిన అనంతరం సీఎం చంద్రబాబు దృష్టికి ఇంచార్జిల నియామక విషయం తీసుకెళ్లటం జరుగుతుందన్నారు. వైసీపీ అరాచకాలను ఎదురించి పార్టీ కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరిని పార్టీ గుర్తుంచుకుంటుందని కష్టపడిన కార్యకర్తకు చంద్రబాబు, నారా లోకేశ్ తగిన గుర్తింపునిస్తారన్నారు. దేవస్థానాలకు ఉన్న అనువంశిక ధర్మకర్తలకు సముచిత స్థానం కల్పిస్తూ త్వరలో పాలక మండళ్ల ఏర్పాటు చేసేందుకు సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మేడికొండ విజయ్, రత్నగిరి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

నాగాయలంకలో టీడీపీ సభ్యత్వాలు

నాగాయలంక : నాగాయలంక 1వ వార్డులో తలశిల శివరామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు విరివిగా చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మంచాల మహేంద్ర కుమార్ రాజా, తలశిల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణస్వామి దేవాలయం లో మౌని అమావాస్య సందర్భంగా ఆదిత్యునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు, ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అవనిగడ్డలో పింఛన్లను తనిఖీ చేస్తున్న వైద్య బృందం

పింఛన్ల తనిఖీ

అవనిగడ్డ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన పింఛన్లపై 9మంది అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి తనిఖీ నిర్వహించారు. 10 సచివాలయాల పరిధిలో గల పింఛన్లను వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమ దుర్గ, జి.జ్యోతి, రాహుల్ ప్రభాకర్, ఎం.రవి, సురేఖ, రియాజ్, సిహెచ్.శ్రీకాంత్, బిపి.పూర్ణిమ, వి.ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి రూ.50 వేల చెక్కు అందజేత

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలులో ఇటీవల మృతి చెందిన ఈడే కృష్ణకుమారి కుటుంబ సభ్యులకు విజయ డెయిరీ జిల్లా మిల్క్ డైరెక్టర్ అర్జా నగేష్, డీసీ చైర్మన్ పోతన స్వామి రూ. 50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గోపీ నాగబాబు, బత్తిన వీరబాబు, కూనపరెడ్డి పాండురంగారావు, బొర్రా శ్రీను, పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కృష్ణకుమారి డెయిరీకి పాలు పోస్తుండటంతో పాటు ఇన్సూరెన్స్ ఉండటంతో ఈ చెక్కును అందజేశారు.



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు

ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు

పెడన రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన, ఉద్యోగులు సమయపాలన, కార్యాలయం, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతుల ఏర్పాట్లు, భవనంలో గల ప్రతి గదిలో ఏఏ విభాగాల ఉన్నాయి, ప్రభుత్వ పథకాల అమలు అనే అంశలను పరిశీలించారు. కార్యాలయం చుట్టూ ఉన్న ముళ్ల కంపను తొలగించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జయరామ, ఏవో శిరీష, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన పెంచాలి

ఎస్పీ గంగాధర్‌రావు



అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

అవనిగడ్డ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరిగిపోతున్న సైబర్ మోసాలు, రుణ యాప్‌లపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఎస్పీ ఆర్.గంగాధర్ రావుఅన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి, ఫైళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల వివరాలను సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల గురించి గ్రామాల్లో, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

సామాజిక భవనం స్వాధీనం



సామాజిక భవనం స్వాధీనం చేసుకునే సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం

మోపిదేవి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు బోడగుంటలో కొంత కాలంగా వివాదాస్పదంగా ఉన్న సామాజిక భవనాన్ని మండల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ, రెవెన్యూ ఉద్యోగులు బోడగుంట గ్రామానికి చేరుకుని సామాజిక భవనం స్వాధీన ప్రక్రియ చేపట్టారు. కొన్నేళ్లుగా సామాజిక భవనంలో గ్రామానికి చెందిన సీబీఎం చర్చి నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు ప్రార్థన నిర్వహించుకుంటుండగా, గ్రామానికి చెందిన వేరే ప్రాంతంలో ఉంటున్న కొందరు సామాజిక భవనాన్ని మతపరమైన అంశాలకు నిర్వహిస్తున్నట్లు లోకాయుక్తను ఆశ్రయించారు. లోకాయుక్త న్యాయమూర్తి ఆదేశాల మేరకు సామాజిక భవనం ఖాళీ చేసి అప్పగించాలని అధికారులు దైవసేవలకు ఐదు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. గ్రామస్థులు, అధికారులకు కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకోవటంతో జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, రావి నాగేశ్వరరావు, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు సర్దిచెప్పి భవనం స్వాధీనం చేసుకున్నారు.



కోడూరులో రైతు కూలీ సంఘం నాయకులు ర్యాలీ

నిషేధిత జాబితా నుంచి రైతుల భూములు తొలగించాలి

కోడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 22ఏ నిషేధిత జాబితా నుంచి రైతులు భూములు తొలగించి, వారికి పట్టాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. కోడూరు ప్రధాన రహదారిపై బుధవారం రైతు సంఘం నేతలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గొల్లపాలెం రోడ్డులోని మార్కిస్టు విజ్ఞాన భవనం వద్ద, పీత శివనాదంకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నడకుదుటి నరసింహారావు మాట్లాడుతూ, నాగాయలంక మండలం ఎదురుమొండి గ్రామానికి వారధిని వెంటనే నిర్మించాలని, అభయారణ్యం పేరుతో నిరుపయోగంగా ఉన్న రెండు వేల ఎకరాల భూమిని ఎదురుమొండి పంచాయతీకి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు సింగోతు నాగేంద్రరావు, నెలబాలుడు, లంకే సుబ్బారావు, సుధీర్, బి.రమేష్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి మల్సూరు, రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

పల్లాకు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

ఘంటసాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మినుములో పల్లాకు తెగులు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుందని, దాని నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల అన్నారు. కొడాలి, తాడేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము పంటను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పొలంలో పసుపు పచ్చని మొక్కలు కనిపిస్తే వెంటనే పీకేయ్యాలన్నారు. ఎకరానికి పిప్రోనిల్ 400 మి.లీటర్లు లేదా ఎసిటామప్రిడ్ 40 మిల్లీ గ్రాములు ఒక లీటరు నీరు చొప్పున ఏదో ఒక దానిని పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో కె.మురళీకృష్ణ, ఉపసర్పంచ్ తుమ్మల శంకరరావు, వీఏఏలు వెంకటలక్ష్మీ, వై.ఆలీ, రైతులు పాల్గొన్నారు.

వేప నూనె వాడకంతో పురుగు నివారణ

మోపిదేవి : మినుము పంటలో ఆశించిన తెగుళ్ల నివారణలో వేప నూనె వాడకం ఎంతో ఉపయోగకరమని ఏవో హెబ్సిబా రాణి తెలిపారు. కప్తానుపాలెం గ్రామంలో బుధవారం రైతులతో కలసి మినుము పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు పవన్ కుమార్, అప్పారావు, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు తేజ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

నాగాయలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక 2వ వార్డులో నివాసం ఉంటున్న తలశిల గోపాలరావు భార్య నీలమ్మ (86) బుధవారం చనిపోయారు. ఆమె నేత్రాలు మరో ఇద్దరికి చూపును ఇస్తాయని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నుంచి మహేష్, సిబ్బంది వచ్చి కార్నియా సేకరించి ఐ-బ్యాంక్‌కు తరలించారు. సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు రఘుశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

మచిలీపట్నం టౌన్, : మచిలీపట్నం వాసవీ ఫ్రెండ్స్ సర్కిల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. శంకరమఠం ఎదురుగా ఉన్న పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ పాల్గొన్నారు.

సినీ రచయిత వేటూరికి ఘన నివాళి



వేటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్, కూటమి నేతలు

అవనిగడ్డ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో సినీ పాటల రచయిత వేటూరి సుందరరామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గాంధీ క్షేత్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేటూరి దివిసీమ వాసి కావటం ఈ ప్రాంతానికి గర్వకారణమని, ఎన్నో అద్భుత గీతాలు ఆయన కలం నుంచి జాలువారినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్, యలవర్తి చిన్నా, మండలి రామ్మోహనరావు, కోట సాయికృష్ణ, శోభిల ఏడుకొండలు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ



కానూరులో పశువైద్యశిబిరం ప్రారంభిస్తున్న గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, నట్టల నివారణ మందులు అందజేస్తున్నామని తెలుగు రైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కానూరు హైస్కూల్, గణపాబత్తుల కానూరు, రైతు భరోసా కేంద్రాల వద్ద పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని గోపు సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ దీపక్ డానియేల్, ఎస్.వి.వి.రామారావు, ఎం.వీరబాబు, గౌరి, రంజిత, ఈశ్వరమ్మ, శ్రీనివాసరావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి కోరారు. చల్లపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెలు, పశువులు, మేకలకు ఉచితంగా టీకాలు, నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందించటం జరుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ ఇంచార్జి ఏడీ డాక్టర్ నందకిషోర్ పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జోన్ క్రీడల్లో గోగినేనిపాలెం విద్యార్థుల హవా



జూనియర్ విభాగంలో సత్తా చాటిన విద్యార్థులతో హెచ్‌ఎం వేణుగోపాలరావు

ఘంటసాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు ఈ నెల 23 నుంచి నాగాయలంక మండలం తగలదీవిలో నిర్వహించారు. ఆటల పోటీల్లో గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాట్టారు. సాఫ్ట్‌బాల్ సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుంచి గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్‌లో జరిగే జిల్లాస్థాయి సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వాసవీమాత త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

అవనిగడ్డ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత అందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని, ఇది వాసవీ మాత త్యాగానికి ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. ఈ నెల 31న చల్లపల్లి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించే అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవానికి ఆర్యవైశ్య ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొల్లిపర రాధాకృష్ణ, విస్సంశెట్టి శ్రీనివాస్, పవన్ కుమార్, ఆర్యవైశ్య ప్రతినిధులు ధన సురేష్, దేసు శేషగిరిరావు, కొల్లిపర మధు, వరదా హరగోపాల్, తమ్మన సతీష్ కుమార్, జల్లూరి ప్రసాద్, ఉరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం 31న నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందని దేవస్థానం పాలకవర్గ చైర్మన్ మామిడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. దేవాలయ ప్రాంగణంలో బుధవారం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బైసాని హయగ్రీవరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బందరుకోటకు చెందిన ఒక వ్యక్తి పలువురు వద్ద అప్పు తీసుకుని ఎగ్గొట్టిన సందర్భంలో మచిలీపట్నం పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. బందరు కోటకు చెందిన బట్టి దుర్గావెంకట లీలాప్రసాద్ జల్సాల నిమిత్తం ఆర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో కొందరి వద్ద రూ. 19 లక్షలు, మచిలీపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో కొందరి వద్ద రూ. 12 లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ సందర్భంగా లీలాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ బి. ప్రభాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నాగాయలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో సీతారామ్ కుమార్ బుధవారం పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, రఘురామయ్య, రజని, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

ఇద్దరు హుండీ దొంగలకు రిమాండ్

గుడివాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండల పరిధిలోని బిళ్లపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో హుండీ దొంగలు ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు. గంగాధరపురం గ్రామంలో బొడ్డు వెంకట్రావును, కత్తుల కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5200, స్ప్రేయర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుడివాడ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, ఇద్దరికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



నిందితులను చూపుతున్న ఎస్ఐ చంటిబాబు

వేగం కన్నా ప్రాణం మిన్న

● డీఎస్పీ ధీరజ్, ఆర్టీవో ఎన్.శ్రీనివాస్

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : వేగం కన్న ప్రాణం మిన్న అనే సూక్తిని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని, సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి డ్రైవరు కంటి చూపు విషయంలో అశ్రద్ధ వహించవద్దని, ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్, ఆర్టీవో ఎన్.శ్రీనివాస్‌లు కోరారు. బుధవారం గుడివాడ మండలం బొమ్ములూరులోని లారీ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ జాతీయ రహదారి మాసోత్సవాలను నిర్వహించారు. ఆటోనగర్ నుంచి భద్రతా మాసోత్సవాల ర్యాలీని లారీ స్టాండ్ వరకు నిర్వహించి, ఉయ్యూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం లారీ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ప్రతి లారీకి బీమా, డ్రైవర్‌కు లైసెన్స్‌తో పాటు భద్రతపై అవగాహన ఉండాలన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు మానవత్వంతో సహాయం అందించాలన్నారు. దిగుమతులుంటేనే లారీలకు పట్టణంలోకి ప్రవేశముందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చల్లా నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సంగీతరావు, యూనియన్ నాయకులు గోళ్ల శివ, గుత్తా చంటి, వల్లూరుపల్లి రామకృష్ణ, బి.శ్రీనివాస్, పోలీసు, రవాణ శాఖల సిబ్బంది, లారీ ఓనర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, ఆర్టీవోలు, సీఐలు, లారీ యజమానులు



నట్టల మందు వేస్తున్న పశువైద్యులు

ఉచిత పశు వైద్య శిబిరం

పమిడిముక్కల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించి సకాలంలో వ్యాధినిరోధక టీకాలు, మందులు వేయించడం ద్వారా పశుపోషణ లాభదాయకం చేసుకోవాలని ఉచిత పశుఆరోగ్య శిబిరాల ప్రత్యేక అధికారి పద్మ అన్నారు. కపిలేశ్వరపురంలో బుధవారం ఉచిత పశుఆరోగ్య శిబిరం నిర్వహించి గేదెలకు వైద్యపరీక్షలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు చేశారు. పశుసంవర్ధక శాఖ డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఏడీలు సీహెచ్ శశికుమార్, సృజని, వెటర్నరీ అసిస్టెంట్స్ వెంకటేశ్వరరావు, కె.రామ్‌నరేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించాలి

● శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికుమార్

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఓల్డ్ టౌన్-2 మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువు, ఆటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు శివ ఇంటీరియర్స్ అధినేత ఎం.శివ ఆర్థిక సహాయంతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు తిరుపతయ్య, అజయ్‌కుమార్, హరిబాబు, తాతారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి సత్యనారాయణ నేతృత్వంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించి మోటార్ బైక్‌లు నడిపేవారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన పరిచారు. బైక్ నడిపేటపుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆయన అన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన తప్పనిసరి

పామర్రు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో అసాంఘికక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా మెలగాలని పామర్రు సీఐ శుభకర్ అన్నారు. స్థానిక ప్రసన్న జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో, పొరుగువారితో ఎదురయ్యే రకరకాల వేధింపులు, అసభ్య ప్రవర్తనలను బాలికలు నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి వినియోగంలో చాలా జాగ్రత్తలు పాటించాలని, ఫొటోలు,వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం ఏర్పాటు చేసిన షి టీమ్‌లకు ఫిర్యాదు వస్తే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగేపు వెంకట్రామయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శుభకర్

ప్రజాధనం జల్సాకు ఖర్చు చేసిన ఘనత జగన్‌దే

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజాధనాన్ని ఇష్టం వచ్చినట్లుగా తన జల్సాలకు వినియోగించి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన ఘనత వైసీపీ అధినేత జగన్‌మోహనరెడ్డిదేనని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలిచ్చిన అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఐదేళ్లపాటు ఆనా టి వైసీపీ ప్రభుత్వం సొంత పత్రిక ప్రకటనలకు, భూ ముల రీసర్వే రాళ్లపై జగన్ బొమ్మలతో ఇతర దుబారా ఖర్చు రూ. 20వేల కోట్లని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ఎంతోగానో శ్రమించడం ప్రజలు చూస్తూనే ఉన్నారన్నారు. వారిశ్రమను గుర్తించి ప్రజలు అన్ని విధాలుగా ప్రభుత్వానికి సహకరించడం సహించలేక వైసీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



రిక్షాలు పంపిణీ చేస్తున్న నరసింహారావు

గ్రీన్ అంబాసిడర్‌లకు రిక్షాల పంపిణీ

గుడ్లవల్లేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా గ్రీన్ అంబాసిడర్‌లకు గ్రామ పంచాయతీ నిధులతో నూతన ట్రక్ రిక్షాలను పంపిణీ చేశామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. పంచాయతీ నిధులు రూ. 1.50 లక్షల వ్యయంతో కొత్తగా 5 ట్రక్ రిక్షాలను కొనుగోలు చేశామని వాటిని గ్రీన్ అంబాసిడర్‌లకు అప్పగించామని తెలిపారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి స్థల పరిశీలన

గుడ్లవల్లేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి అధికారులు, నాయకులు బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక అభ్యుదయ పాఠశాల సమీపంలో ఉన్న పంచాయతీ స్థలంలో క్యాంటీన్ నిర్మించాలని అధికారులు నాయకులు ఏకాభిప్రాయానికి రాగా దీనికి సంబంధించిన టెక్నికల్ అంశాలను, ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.విజయసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరసింహారావు, గ్రామ మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, మాజీ ఎంపీపీ జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య, రంగబాబు, యెనిగళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

తోట్లవల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవిపై మాజీ జడ్జి అనుచిత వ్యాఖ్యలు చేయటంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మండల ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు బుధవారం తోట్లవల్లూరు ఎస్సై సీహెచ్ అవినాష్‌కు ఫిర్యాదు చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్లో ఇంటర్వ్యూ ఇస్తూ మహిళా సమాజం తలదించుకనే విధంగా రామకృష్ణ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇంటూరి భాను, శీలం గణేష్, ఇంటూరి శ్రీనివాసరావు, శీలం నాగరాజు, ఇంటూరి పవన్, విక్రమ్‌సింహ, రాజేష్ తదితరులు ఎస్సైకు ఫిర్యాదు అందించారు.



ఎస్సై అవినాష్‌కు ఫిర్యాదు అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

ధార్మిక సంస్థలు సేవలందించాలి : బూరగడ్డ



గర్భిణులకు పారితోషకాలు అందజేస్తున్న బూరగడ్డ

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : దాతల ఆశయానికి అనుగుణంగా ధార్మిక సంస్థలు సేవలందించాలని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద గల శ్రీఘంటసాల నాగభూషణం ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో పేద వైశ్య విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పౌష్టికాహార నిమిత్తం నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూరగడ్డ మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారులు 55మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున, 200మంది గర్భిణులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున పౌష్టికాహార నిమిత్తం నగదును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, జగన్మోహనరావు, మణిదీప్, జనసేన నాయకులు సాయన రాజేష్, వేమూరి త్రినాథ్, ఆర్యవైశ్య ప్రముఖులు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి వరప్రసాద్, తనిఖీ అధికారి సుధాకర్, ఆలయాల ఈవోలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక అహింసా సంప్రదాయ సేవా ఆసుపత్రి ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన గర్భిణులకు పారితోషకాలు అందజేసే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు.

ఆర్డీవోకు సత్కారం

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్న గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, సభ్యులు అజయ్‌కుమార్, జాజుల మునీంద్ర, తాతారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుల్లో నీటిని నింపుకోండి

గుడివాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుడివాడ తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నందున పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు తాగునీటి చెరువుల్లో నీటిని నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. తాగునీటి అవసరాల కోసం నీరు విడుదలైనందున ప్రతీ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు చెరువులను నింపి వేసవి కాలంలో నీటి కొరత లేకుండా చూడాలని పలు సూచనలు చేశారు.

పైపులైన్ లీక్.. వృథాగా పోతున్న నీరు

పెదపారుపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాములపాడు సచివాలయం శివారు దూళ్లవానిగూడెం శ్మశాన వాటిక వద్ద ఉన్న పైపులైన్ లీకై నీళ్లు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అవసరాలకు నీళ్లు దొరకక ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం నీరు వృథాగా పోతున్నా చర్యలు తీసుకోవటంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లీకేజీ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వృథాగాపోతున్న తాగునీరు

ఫైర్‌ఆఫీసర్‌కు సత్కారం

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు తన సర్వీస్‌లో 30 ప్రశంసాపత్రాలు, అవార్డులను అందుకోవడం గొప్ప విషయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ చేతుల మీదగా ఉత్తమ ఫైర్‌ఆఫీసర్ అవార్డునందుకున్న ఆంజనేయులను బుధవారం స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల బుడమేరు వరదల్లో చిక్కుకున్న బస్సు ప్రయాణీకులను రక్షించేందుకు తన సిబ్బంది చూపిన చొరవ, పనితీరు వలనే తనకు అవార్డు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, వై.ఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కూచిపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పంతగాని శివయ్యకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న చుట్టుపక్కల గృహాలకు చెందిన వారు మంటలను అదుపులోకి తెచ్చారు.

గుడివాడ-కంకిపాడు రోడ్డు అభివృద్ధి చేయాలని పోస్టుకార్డుల ఉద్యమం

గుడివాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : గుడివాడ - కంకిపాడు రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ, హైకోర్టులో రహదారి అభివృద్ధి కోసం వేసిన కేసును త్వరగా విచారణ చేపట్టాలని కోరుతూ మొదటి విడతగా 2000 పోస్టుకార్డులను బుధవారం హైకోర్టు న్యాయమూర్తికి రిజిష్టర్ పోస్టు ద్వారా పంపారు. ఈ కార్యక్రమం భద్రతాదళం సభ్యులు ఎండీ తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాగమోహనరావు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

కూచిపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు పేర్కొన్నారు. పవర్ గ్రిడ్ సంస్థ అందించిన పలు మొక్కలను కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం ఆవరణలో కళాపీఠం అధ్యాపకులు, విద్యార్థులతో కలసి ఆయన నాటారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డా.చింతా రవిబాలకృష్ణ, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సత్యప్రసాద్, గ్రంథాలయ అధికారి ఫణికుమార్, నాట్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువు పరిశీలన

గుడ్లవల్లేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సేరిదగ్గుమిల్లి గ్రామ పంచాయతీ తాగునీటి చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి నీరు పాడైపోతున్నాయని గ్రామస్థులు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.విజయసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్‌లు చెరువును పరిశీలించారు. అంతేకాక టెక్నికల్ సిబ్బందిని పిలిపించి ఎస్టిమేట్ వేయించారు.గురువారం నుంచి చెరువులో తూడు తొలగింపు పనులు ప్రారంభిస్తామని విజయసారథి తెలిపారు.

మినుము పైరుకు ఎటువంటి ఎరువులు వేయొద్దు

● శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

గుడివాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మినుము పైరుపై ప్రస్తుతం ఎటువంటి బలానికి పనికి వచ్చే మందులు, ఎరువులు వేయవద్దని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌సుధారాణి అన్నారు. దొండపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొలంలో మినుము పైరును ఆమె పరిశీలించారు. కొంతమంది రైతుల పొలాలకు వెళ్లి ఏయే మందులు పిచికారి చేశారు, ఎటువంటి ఎరువులు వినియోగించారో వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూతలో పురుగులు కనపడితే అనవసరంగా ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు పిచికారి చేయవద్దన్నారు. జిల్లా డీఆర్సీ కె.జ్యోతిర్మయి మాట్లాడుతూ మినుము పంటలో పురుగులు కనిపిస్తే వేపనూనె కలపి పిచికారి చేయాలన్నారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు చేపట్టిన సూచనలు, సలహాలు పాటించి మినుము పైరును కాపాడుకోవాలన్నారు. డీఆర్సీ ఏడీఏ కె.శ్రీనివాసరావు, గుడివాడ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో బి.పద్మజ, ఏవో బోలెం అనంతలక్ష్మి, ఏఈవో డి.అనూష, వీపీఏ భవాని, వల్లివర్తిపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగమనేని వీరబవసయ్య, సెరిగొల్వేపల్లి డీసీ ఛైర్మన్ నూతక్కి కుటుంబరావు, దొండపాడు గ్రామ రైతులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం కనుమూరు, కురుమద్దాలి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.స్వర్ణలత మాట్లాడుతూ, గ్రామాల్లో రైతులకు మేలైన వ్యవసాయ పద్ధతులతో అవగాహన కల్పించడంతోపాటు సాంకేతికంగా సుశిక్షితులుగా తయారు చేయడం కోసం పొలంబడి దోహదపడుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలని సూచించారు. ప్రస్తుతం మినుము పైరును ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు అవసరమైన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి విశివనాగరాణి, రైతులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : కౌతవరం గ్రామంలో పొలంబడి నిర్వహించారు. మినప చేలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి ఎల్. సునీల్‌కుమార్ రైతులతో మాట్లాడుతూ పొగాకు లద్దిపురుగు అధికంగా ఆశించినపుడు ఆకుల ఈనెలు మాత్రమే మిగులుతాయన్నారు. దాని నివారణకు వేప సంబంధిత మందును ఎకరాకు లీటరు చొప్పున పిచికారి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కే.యశ్వత్‌రాజా, వ్యవసాయ సహాయకులు సౌజన్య, వనిత పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా శాస్త్రవేత్త సుధారాణి